

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- సీసీ కెమెరాల నిఘాలో నిర్వహణ
- ఖమ్మం జిల్లాలో 72 కేంద్రాలు.. 36,660 మంది విద్యార్థులు
- భద్రాద్రి జిల్లాలో 36 కేంద్రాలు.. 19,258 మంది విద్యార్థులు

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షల కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఖమ్మం జిల్లావ్యాప్తంగా 72పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 36,660 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా వారిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 17,783మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 18,877 మంది ఉన్నారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్, 5 సిట్టింగ్ స్క్వాడ్ టీంలు, 72 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, 72 మంది చీఫ్ సూపరిండెంట్‌లతో ఏర్పాటు చేశారు. జిల్లా ఇంటర్మీడియట్ (మిగతా 6వ పేజీలో)



బీజీ కొత్తూరు పంప్‌హౌస్ వద్ద నీటిని తిలకిస్తున్న మంత్రి తుమ్మల

కృష్ణమ్మ ఒడికి గోదావరి జలాలు

- సీతారామ మూడు లిఫ్టుల నుంచి ఎన్నెస్పీ ఆయకట్టుకు నీరు
- యాసంగికి నీటిని విడుదల చేసిన మంత్రి తుమ్మల
- రాజీవ్ కెనాల్ ద్వారా నేడు వైరా రిజర్వాయర్‌కు చేరిక

ఖమ్మం(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొత్తగూడెం, మార్చి 3:(ఆంధ్రజ్యోతి): సాగర్ ఆయకట్టులో ఖమ్మం జిల్లాలోని ఎడమ కాలువ కింద నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు అందించనున్నారు. గోదావరిపై నిర్మించిన సీతారామ ఎత్తిపోతల పథకం కింద ఉన్న మూడు లిఫ్టులు బీజీ కొత్తూరు, పూసూరు, కమలాపురం ఎత్తిపోతల పథకాల నుంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం గోదావరి జలాలను విడుదల చేశారు. దాంతో ఏన్కూర్ సమీపంలోని రాజీవ్‌కెనాల్ నుంచి మంగళవారం రాత్రికి వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు చేరబోతున్నాయి. వైరా రిజర్వాయర్ నుంచి వైరా సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు చెందిన లక్ష ఎకరాలకు యాసంగిలో సాగవుతున్న వరి, మొక్కజొన్న పంటలు గోదావరి జలాలతో సస్యశ్యామలం కానున్నాయి. అసంపూర్తిగా వదిలేసి ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌ను ఒప్పించి ఏన్కూరు వద్ద లింక్ కెనాల్ రూ.90కోట్లు నిధులు మంజూరి చేయించి పనులను పూర్తి చేయించారు. గత ఏడాది ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీతారామ ఎత్తిపోతల లిఫ్టులను ప్రారంభించడంతో పాటు ఏన్కూరు లింక్‌కెనాల్‌ను కూడా ఆరోజు ప్రారంభించారు. అయితే వానాకాలం సీజన్‌లో సకాలంలో సాగర్‌నీరు రావడంతో అప్పుడు గోదావరి జలాలు సాగర్ ఆయకట్టు అవసరం రాలేదు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో వరి తదితర పంటలు సాగవుతున్న నేపథ్యంలో సాగర్ ఆయకట్టుకు నీటి కొరత నెలకొంది. దీంతో ఆయకట్టు భూములకు నీళ్ల అందడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని, అశ్వారావుపేట, పినపాక ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులతో కలిసి సోమవారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి వద్ద గోదావరి జలాలను పరిశీలించారు. అనంతరం బీజీ కొత్తూరు ఎత్తిపోతల పథకంతో పాటు కమలాపురం, పూసూరు ఎత్తిపోతల పథకాలను సందర్శించి గోదావరి జలాలను విడుదల చేశారు. ఈ నీళ్ల ఏన్కూరు రాజీవ్ లింక్‌కెనాల్ ద్వారా మంగళవారం రాత్రి వైరా రిజర్వాయర్‌కు చేరుకుని అక్కడి నుంచి సాగర్ ఎడమ కాలువ ద్వారా ఆయకట్టుకు నీళ్ల అందనున్నాయి.

యాసంగిలో సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- దుమ్ముగూడెం ఆనకట్ట, సీతారామ పంప్‌హౌస్‌ల సందర్శన

వివరాలు : 6లో



విక్టరీ చూపుతున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి

పీఆర్టీయూదే విజయం

- టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీపాల్‌రెడ్డికి పట్టం
- మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ దక్కని కోటా ఓట్లు
- ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో గెలుపు

నల్లగొండ, మార్చి 3(ఆంధ్రజ్యోతిప్రతినిధి): హోరాహోరీగా సాగిన నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో పీఆర్టీయూ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ, యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి కంటే ఆధిక్యం సాధించిన శ్రీపాల్‌రెడ్డి గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం రాత్రి అధికారికంగా ప్రకటించారు. మూడో స్థానంలో పీసీసీ అధికార ప్రతినిధి, టీపీఆర్టీయూ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నిలిచారు. హర్షవర్ధన్‌రెడ్డి నిష్క్రమణ (ఎలిమినేషన్) తర్వాత శ్రీ పాల్‌రెడ్డికి 11,099 ఓట్లు రాగా, నర్సిరెడ్డికి 8,448 ఓట్లు వచ్చాయి. తొలుత మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు అనంతరం కోటా ఓటు 11,821 ఓట్లు ఎవరికీ రాకపోవడంతో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు అనంతరం అతి తక్కువ ఓట్లు వచ్చిన స్వతంత్ర అభ్యర్థులు 13 మందిని 14వ రౌండ్ వరకు ఎలిమినేట్ చేస్తూ ద్వితీయ ప్రాధాన్య ఓట్లు లెక్కించారు. నల్లగొండలోని ఆర్జాలబావి వద్ద ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో సోమవారం ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలైంది. ఉదయం ఏడుగంటలకే ఎన్నికల పరిశీలకుడు మహ్మదీన దీమ్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్ కౌంటింగ్ (మిగతా 6వ పేజీలో)



పులిగుండాలలో అరుదైన డేగ

- ఖమ్మం జిల్లా కనకగిరి అడవుల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు
- ఉష్ణమండల ఆసియా ప్రాంతాల్లో సంచరించే డేగ



సీసీ కెమెరాలకు చిక్కిన అరుదైన డేగ

పెనుబల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఉష్ణమండల ఆసియా ప్రాంతంలో సంచరించే డేగ ఖమ్మం జిల్లాలోని పులిగుండాల అటవీ ప్రాంతంలో సంచరిస్తూ సీసీ కెమెరాలకు చిక్కింది. పెనుబల్లి మండలం కనకగిరి అటవీ ప్రాంతంలో ఉన్న పులిగుండాల ప్రాజెక్టు ప్రాంతంలో అటవీశాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఆసియా ప్రాంతంలో నివసించే పక్షి రూఫస్ బెల్లిడ్ ఈగల్ సంచరిస్తూ కనిపించింది. ఉష్ణమండపం ఆసియా ప్రాంతాల్లో అరుదుగా కనిపించే ఈ పక్షి పులిగుండాల ప్రాంతంలో కనిపించడం ఆశ్చర్యానికి గురి చేసింది. కనకగిరి అటవీ ప్రాంతంలో ఇప్పటికే అటవీశాఖ అధికారులు అనేక రకాల అరుదైన అటవీ జీవులను గుర్తించారు. ప్రస్తుతం సీసీ కెమెరాలకు చిక్కిన రూఫస్ బెల్లిడ్ ఈగల్ పక్షి డేగ, గద్దలకు దగ్గర పోలికలతో ఉంటుందని, ఇది వేటాడే జాతి కుటుంబానికి చెందింద పక్షి అని అటవీశాఖ అధికారలు తెలిపారు. ఇది పూర్తిగా విక్షణమైందని తెలిపారు.



వసంతోత్సవంలో సీతారాములు(ఫైల్)

14న భద్రాద్రిలో డోలోత్సవం, వసంతోత్సవం

6



అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన 'ఎర్ర' బంగారం

6

సిగరెట్ కోసం హత్య

- మద్యం మత్తులో స్నేహితుడిని బండతో కొట్టిన వ్యక్తి
- మణుగూరు హత్య కేసును ఛేదించిన పోలీసులు



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి

మణుగూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓ ప్రైవేటు కంపెనీ సమీపంలో ఉన్న గాంధీనగర్ శివారు ప్రాంతంలో ఓసీ-4వాగు వద్ద గత నెల 27వ తేదీ రాత్రి జరిగిన హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన మునిప్రసాద్ విశ్వకర్మ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి తెలిపారు. మునిప్రసాద్ విశ్వకర్మతో పాటు గుజరాత్‌లోని పంచమహా జిల్లా గోగాంబ మండలం మహాదేవ్య గ్రామానికి చెందిన వినోద్ సిన్హా మణుగూరు ఓసీ సమీపంలో దుర్గా కంపెనీలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ మంచి మిత్రులుగా ఉండేవారు. కాగా ఈ ఇద్దరు మిత్రులు గత నెల 27వ తేదీ రాత్రి విధులు ముగించుకొని మణుగూరు పూలమార్కెట్ ఏరియాలోని వైన్ షాపులో రెండు మద్యం బాటిళ్లు, రెండు బిర్యానీ ప్యాకెట్లు కొనుక్కొని సమీపంలోని వాగు వద్దకు వెళ్లి మద్యం తాగారు. ఈ క్రమంలో ఒక్క సిగిరెట్ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగి కొట్లాటకు దారి తీసింది. ఈ క్రమంలో వినోద్‌సిన్హా పక్కనే ఉన్న బండరాయితో విశ్వకర్మను తలపై కొట్టాడు. దాంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. డాగ్‌స్క్వాడ్, సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి తెలిపారు. దుర్గా కంపెనీ మేనేజర్ ముత్తుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. హత్య కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహించిన సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐలు మేడప్రసాద్ బి.రంజిత్‌కుమార్, ట్రైనీ ఎస్ఐ మనీషా, కానిస్టేబుల్స్ వీరా, షమీమ్, రామారావులను డీఎస్పీ అభినందించి నగదు అవార్డులను అందజేశారు.

మిర్చిని ఆహార పంటల జాబితాలో చేర్చాలి

- క్వింటాలు మిర్చికి రూ.25వేల మద్దతు ధర చెల్లించాలి
- సీపీఐ, సీపీఎం, మాస్‌లైన్, బీఆర్ఎస్ రైతు సంఘాల నిరసన

వివరాలు : 6లో



దరఖాస్తుదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్

అర్జీల ఆన్‌లైన్‌ను సక్రమంగా చేయాలి

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- గ్రీవెన్స్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెకర్లు శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అంతకు ముందు కలెక్టరేట్‌లోని ప్రజావాణి దరఖాస్తుల నమోదు కంప్యూటర్ విభాగానికి వెళ్లి అర్జీల ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. దరఖాస్తులను స్పష్టంగా కనపడే విధంగా స్కానింగ్ చేయాలని సూచించారు. అనంతరం చేయూత పెన్షన్ సహాయక కేంద్రం తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ఆయాశాఖలకు అందిన అర్జీలను పరిశీలించి, పెండింగ్‌లో లేకుండా తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్డీవో సన్యాసయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిభాయి, లాండ్‌సర్వే ఏడీ శ్రీనివాసులు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అందిన ఫిర్యాదుల్లో కొన్ని...

- ఖమ్మం అర్బన్ మండలం కోయచలక గ్రామంలో సర్వే నెంబర్ 192లో ఇందిరమ్మ మూడో విడతగా నిరుపేదలకు 75 గజాల స్థలాన్ని కేటాయించారని వాటిని ప్రస్తుత అధికారులు స్థలంలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని కాలనీ వాసులు పెద్ద మెత్తంలో వచ్చి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన తాటి రాములు సర్వే నెంబర్ 113 లో గిరిజనుడైన తన భూమిని గిరిజనేతరులు ఆక్రమించారని తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు.
- ఖమ్మం కార్పొరేషన్ ప్రకాశ్‌నగర్‌కు చెందిన విజయ్‌కుమార్ తన వ్యాపార కోసం బ్యాంకు నుంచి లోన్ మంజూరు చేయించి దివ్యాంగుల కోటాలో మూడు చక్రాల ఎలక్ట్రిక్ బండి ఇప్పించగలరని కలెక్టర్‌ను వేడుకున్నాడు.
- కల్లూరు మండలానికి చెందిన ఎస్. సుజాత ప్రభుత్వ పాఠశాలల్లో ఏడవ తరగతి వరకు చదువుకున్నానని, కల్లూరులోని నాగార్జున సాగర్ ప్రాజెక్టులో ఉన్న ఇరిగేషన్ కార్యాలయంలో స్వీపర్ పోస్ట్ ఖాళీగా ఉందని దివ్యాంగుల కోటాలో తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకుంది.

వకులామాత ఒడిలో శ్రీవారి కల్యాణం

ప్రారంభానికి సిద్ధమైన అత్యాధునిక స్టేడియం

- భారీ వ్యయంతో నిర్మించిన ఆలయానికి అప్పగించనున్న దాతలు
- ఇక కనులపండగలా జమలాపురం వేంకటేశుడి పరిణయం



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలం తర్వాత రెండో ప్రాచీన దేవాలయంగా జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి స్వయంభు దేవాలయం పేరుగాంచింది. భద్రాద్రి మిథిలాస్టేడియం నమూనాలో జమలాపురం శ్రీవారి కల్యాణం నిర్వహించేందుకు జమలాపురం గ్రామానికి చెందిన ఖమ్మం నగర వాసి కేఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వర రావు, నిర్మలకుమారి దంపతులు శ్రీవారిపై అత్యంత భక్తితో వకుళామాత స్టేడియాన్ని సుమారు రూ.6కోట్ల వ్యయంతో నిర్మించారు.

ఎర్రుపాలెం, మార్చి3(ఆంధ్రజ్యోతి): మూడు వేల మందికి పైగా శ్రీవారి కల్యాణం వీక్షించేందుకు జమలాపురంలో స్టేడియాన్ని నిర్మించారు. స్టేడియంలో ఖరీదైన గ్రానైట్ రాయితో కుప్పంకు చెందిన 60మంది శిల్పులు మూడేళ్ల శ్రమించి కల్యాణ మండపాన్ని గోపురం శిఖరంతో తీర్చిదిద్దారు. స్టేడియం నలుదిక్కుల నుంచి ద్వారాలతో , లోపల మండపానికి విస్తారమైన మెట్లు ఉన్నాయి. ఈ నిర్మాణానికి ఆరు సంవత్సరాల కాలం పట్టింది.

7న శిఖర ప్రతిష్ఠ, ప్రారంభోత్సవం

ఈనెల7న 8.27గంటలకు శాస్త్రోక్తంగా కల్యాణ మండపానికి జమలాపురం ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో శిఖర ప్రతిష్ఠ చేయనున్నారు. ఉదయం 11గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్టేడియాన్ని ప్రారంభించనున్నారు.

కమనీయంగా కల్యాణం

స్టేడియం ప్రారంభోత్సవం అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితుడు జానుతల త్రివేదిశర్మ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12గంటలకు మండపంలో అట్టహాసంగా అత్యంతవైభవంగా మొట్టమొదటి శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నారు. ఇప్పటికే జిల్లా నలుమూలల గల ప్రముఖులు, రాజకీయనాయకులకు ఆహ్వానాలు అందాయి. 20వేల మందికి ప్రజలు హాజరవుతారని దాతలు పేర్కొన్నారు. సాయంత్రం శ్రీవారి దంపతుల గ్రామోత్సవం తదనంతరం వకుళమాత స్టేడియాన్ని దేవస్థానానికి బహూకరించనున్నట్టు దాతలు తెలిపారు. ఇక నుంచి యేటా వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించే శ్రీవారి కల్యాణం వకుళమాత స్టేడియంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

శ్రీవారి సేవ పూర్వజన్మ సుకృతం

తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతులు వకుళమాత స్టేడియం నిర్మాణదాతలు



మా ఇద్దరిదీ జమలాపురమే. నవమికి రెండు రోజులు ముందే కనుల పండవుగా జమలాపురం శ్రీవారి కల్యాణం జరుగుతుంది. అది మాకు ఎంతో ప్రత్యేకం. ఆలయానికి ఆర్థికంగా సహరించినా శ్రీవారి కల్యాణానికి ఏదో ఒకటి చేయాలన్న తపన ఎప్పటినుంచో ఉంది. శ్రీవారి కల్యాణాన్ని భక్తులు ప్రశాంతంగా చూడటానికి మండపం కట్టించాలని అనుకున్నాం. దానికోసం ప్రత్యేక డిజైన్ రూపొందించాం. రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావాలనే ప్రయత్నంలో భాగంగా వకుళామాత స్టేడియాన్ని నిర్మించాం. చెన్నైలో నిపుణులైన స్వర్ణకారులతో 2.5అడుగుల శ్రీవారి పంచలోహ ఉత్సవమూర్తులను తయారుచేయించాం. ఇదంతా మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం

పెరగనున్న జమలాపురం ప్రతిష్ఠ: కె. జగన్మోహన్‌రావు, ఈవో



వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ సంవత్సరం మరింత శోభను సంతరించుకోనున్నాయి. ఈ ఏడాది శ్రీవారి వార్షిక కల్యాణానికి వకులమాత స్టేడియం నిర్మాణం పూర్తయింది. ఈ ఏడు శ్రీవారి కల్యానంతో ఆలయ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని భావిస్తున్నాం. దేవాలయానికి స్టేడియం నిర్మాణ దాతలు తుళ్లూరు దంపతులు మహారాజ పోషకులుగా వ్యవహరిస్తున్నారు. దేవాలయానికి వారి సహకారం అంత్యంత విలువైనది. గత దశాబ్దాల కాలంగా బ్రహోత్సవాలలో నిర్వహించే తెప్పోత్సవానికి, వైకుంఠ ఏకాదశి ఉత్తరద్వార దర్శనంతో పాటు దేవాలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు దాతల సహకారంతోనే ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.



విద్యుద్ దీపాల అలంకరణలో స్టేడియం

పోటెత్తిన 'ఎర్ర'బంగారం

ఖమ్మం మార్కెట్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం (తేజారకం మిర్చి) పోటెత్తింది. సోమవారం సుమారు లక్ష మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. వానాకాలం(ఖరీఫ్)మిర్చి సీజన్ ప్రారంభమైన తరువాత పంట ఇంత భారీ మొత్తంలో రావడం ఇది మూడోసారి. మార్కెట్‌కు గత శనివారం సుమారు 55వేల బస్తాల వరకు అమ్మకానికి రాగా సోమవారం పంటను భారీగా అమ్మకానికి తీసుకొచ్చారు. మార్కెట్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాల రైతులు పంటను అమ్మకానికి తెస్తున్నారు. ఇదిలా ఉండగా మార్కెట్లో క్వింటాలు మిర్చి రూ.14,100జెండాపాట నిర్ణయించగా వ్యాపారులు మిర్చి నాణ్యతను బట్టి క్వింటాలుకు కనిష్ఠంగా రూ.5,500, గరిష్ఠంగా రూ.13,800 వరకు కొనుగోలు చేశారు. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, గ్రేడ్‌టూ సెక్రెటరీ సృజన్‌బాబు, అసిస్టెంట్ సెక్రెటరీ వీరాంజనేయులు తదితరులు సమీక్షించారు.

మిర్చిని ఆహార పంటల జాబితాలో చేర్చాలి

సీపీఐ, సీపీఎం, మాస్‌లైన్, బీఆర్ఎస్ రైతు సంఘాల నిరసన

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మిర్చి పంటను ఆహార పంటల జాబితాలో చేర్చి, కనీస మద్దతు ధర క్వింటాకు రూ.25వేలు చెల్లించాలని, అలాగే ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ, సీపీఎం అనుబంధ రైతు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, పోతినేని సుదర్శన్‌రావు, మాస్‌లైన్ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ తాతు మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. ఆయా పార్టీల ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మిర్చి రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సంవత్సరం మిర్చికి వాతావరణం అనుకూలించకపోవటంతో మిర్చి పంటను సాగు చేసేందుకు వ్యయం పెరిగిందన్నారు. గతేడాది క్వింటా మిర్చి రూ.20వేల ధర ఉండగా ఇప్పుడు కేవలం రూ.12వేల నుంచి రూ.13వేలు మాత్రమే ఉందన్నారు. ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేయటం ద్వారానే మిర్చి రైతులకు సరైన న్యాయం జరుగుతుందని డిమాండ్ చేశారు. క్వింటా రూ.25వేలకు కొనుగోలు చేసే వరకు రైతులతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. పెరుగుతున్న వ్యవసాయ వ్యయానికి తగిన స్థాయిలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకొని నాఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, చంద్రావతి, దొండపాటి రమేశ్, కొండపర్తి గోవిందరావు, ఆ డపా రామకోటయ్య, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, ఆవుల వెంకటేశ్వర్లు, పుచ్చకాయల సుధాకర్, భాగం ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులను కలిసి వినతిపత్రం అందించారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

అధికారి కె. రవిబాబు సారథ్యంలో వివిధ శాఖలకు చెందిన అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లుచేశారు.

భద్రాద్రి జిల్లాలో ఇలా..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 19,258 మంది విద్యార్థులు ఉండగా వారిలో ఫస్టియర్ విద్యార్థులు 9,255 మంది, సెకండియర్ విద్యార్థులు 10,003మంది విద్యార్థులకు హాల్ టికెట్లు మంజూరు చేసినట్లు జిల్లా ఇంటర్ అధికారి హెచ్. వెంకటేశ్వరరావు తెలిపారు. పరీక్షల నిర్వహణకు మొత్తం 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షల నిర్వహణకు 36మంది చీఫ్‌సూపరింటెండెంట్లు, 36మంది డిపార్టుమెంటల్ అధికారులు, 13మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు సిట్టింగ్ స్క్వాడ్, ఐదుగురు కస్టోడియన్స్ అధికారులు, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు

ఇంటర్ పరీక్షలు ఈసారి సీసీ కెమెరాల నిఘా నీడన నిర్వహించనున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. పరీక్షా సెంటర్లకు దగ్గరలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయనున్నారు. పోలీసుస్టేషన్ల నుంచి ఎస్కార్ట్ సహాయంతో ప్రశ్నాపత్రాలను నేరుగా పరీక్షా కేంద్రాలకు తరలించనున్నారు. గతానికి భిన్నంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రణాళికాబద్ధంగా అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ఈ పరీక్షలను సజావుగా ముగించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే ఈ సారి నిమిషం నిబంధనను ఎత్తివేశారు. పరీక్ష ప్రారంభమైన తరువాత ఐదు నిమిషాల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తారు. పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయి. దాంతో ఒక గంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఉదయం 8.30నుంచి విద్యార్థులను పరీక్షా హాల్లోకి అనుమతిస్తారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇంటర్నెట్‌లో నేరుగా తమ హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆయా హాల్‌టిక్కెట్లపై కళాశాల ప్రిన్సిపాల్ సతకం లేకపోయినా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రాలను గుర్తించేందుకు హాల్‌టికెట్‌పై ఈ ఏడాది క్యూఆర్‌కోడ్‌ను ముద్రించారు. ఈ కోడ్‌ను స్కాన్ చేయటంతో పరీక్షా కేంద్రం వివరాలను, అడ్రస్‌లను చూపుతుంది. దీంతో విద్యార్థులకు కొంత ఇబ్బందులు లేకుం డా ఉంటాయని అధికారులు తెలిపారు. ఒకరోజు ముందుగానే పరీక్షా కేంద్రాలను విద్యార్థులు, వారి తల్లితండ్రులు చూసుకోవాలని తెలిపారు.

పరీక్షా కేంద్రాలు తెలియక విద్యార్థుల తిప్పలు

ఖమ్మం నగరంలో పరిక్ష కేంద్రాలు పడ్డ విదార్థులు తమ పరీక్ష కేంద్రాలు ఎక్కడున్నాయో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఖమ్మం నగరం పెరగకముందు ఉన్న అడ్రస్సులే అధికంగా ఉన్నా యి. ఉదాహరణకు నగరంలో జిల్లా కోర్టు వద్ద ఉన్న నారాయణ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని హాల్ టికెట్‌లో నారాయణ జూనియర్ కళాశాల ఖమ్మం ఖానాపురం హవేలీ అని ముద్రించారు. దీంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఖానాపురంలో నారాయణ కాలేజీ ఎక్కడుందని తిరుగుతున్నారు. ఎక్కువగా గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రు లు పరీక్షా కేంద్రాలు తెలియక తికమకపడుతున్నారు. అదేవిధంగా నగరంలోని కొన్ని ప్రైవేటు జూనియర్ కాలేజీలు, ఒకే కాలేజీ పేరుతో అనేక బ్రాంచ్‌లు కలిగిన కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయటంతో వాటి అడ్రస్‌లు సరిగా ముద్రించలేదని తెలిసింది. దీంతో విద్యార్థులు ఒక కళాశాలకు వెళ్లాల్సింది మరో కళాశాలకు వెళ్లే ప్రమాదం ఉంది. గత ఏడాది ఇలాంటి ఘటనలు జరిగాయి. అయినా అధికారులు ఈ ఏడాది కూడా పరీక్ష కేంద్రాల అడ్రస్సులను సరిగా ముద్రించకుండానే హాల్ టికెట్లు అందించారని పలువురు విద్యార్థులు వాపోతున్నారు.

యాసంగిలో సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

అశ్వాపురం/ములకలపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): యాసంగిలో సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు పేర్కొన్నారు. రాజీవ్ లింక్‌కెనాల్ ద్వారా గోదావరి జలాల తరలింపు ప్రారంభమైందని, మంగళవారం రాత్రికి జలాలు వైరా రిజర్వాయర్‌కు చేరతాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో సోమవారం మంత్రి అశ్వాపురం, ములకలపల్లి మండలాల్లో పర్యటించారు. ముందు కుమ్మరిగూడెం ఆనకట్ట వద్ద గోదావరిలో నీటిలభ్యతను పరిశీలించిన అనంతరం, బీజీ కొత్తూరులో మొదటి పంప్‌హౌస్ వద్ద బహుబలి మోటార్ ద్వారా నీటి విడుదలను తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటిదశ పంప్‌హౌస్ నుంచి పూసుగూడెం, కమలాపురం లిఫ్ట్‌లకు గోదావరి జలాలను విడుదల చేసినట్టు తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్‌తో రబీలో సాగర్ ఆయకట్టులో పంటలు ఎండిపోకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని మధిర, సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ, పెనుబల్లి, వేంసూరు మండలాల్లో సాగర్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామన్నారు. వచ్చే వానాకాలం సీజన్ నాటికి ఉమ్మడి జిల్లాలో 6లక్షల 74వేల ఎకరాలకు సీతారామా ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందుతుందన్నారు. సీతారామా ప్రాజెక్ట్ కెనల్‌కు అనుసంధానంగా నిర్మితమవుతున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం, మణుగూరు, పినపాక, బూర్గంపాడు మండలాలకు వానాకా లం నాటికి సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, నీటిపారుదలశాఖ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర గిడ్డంగులశాఖ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



పంపుహౌజ్-3 నుంచి గోదావరి జలాల ఎత్తిపోత

కమలాపురం శివారు సీతారామ పంపుహౌజ్-3 నుంచి గోదావరి జలాలను సోమవారం ఎత్తిపోశారు. ఐదు రోజులు క్రితం అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని సీతారామ ఎత్తిపోతల పథకం పంపు ఒకటి నుంచి గోదావరి జలాలు లిఫ్టింగ్ ప్రారంభించారు. సోమవారం ఉదయం నీరు పంపుహౌజ్-2 నుంచి నీటిని ఎత్తిపోశారు. దీంతో మోటారు ద్వారా దిగువ ఉన్న కమలాపురం పంపు హౌజ్‌కి నీరు చేరింది. పంపు హౌజ్-3 నుంచి సాయంత్రం నీటిని ఎత్తిపోశారు. ఈ నీరు మంగళవారం సుమారు రెండు గంటల ప్రాంతంలో రాజీవ్‌సాగర్ కాలువకు చేరుతుంది.

రాజీవ్ కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టుకు సాగునీరు

ములకలపల్లి మండలంలోని పూసుగూడెం వద్ద సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్ 2, కమలాపురం పంప్‌హౌస్-3ని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పరిశీలించారు. విలేకరులతో మాట్లాడుతూ రాజీవ్‌కెనాల్ ద్వార సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందుతుం దన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడా నికి సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారన్నారు. ములకలపల్లి మండలంలో ప్రతి నీరు అందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు క్లియరెన్స్ ఇవ్వాలని కోరారు.

14న భద్రాద్రిలో డోలోత్సవం, వసంతోత్సవం

అదే రోజు రామయ్య కల్యాణ పనులకు శ్రీకారం

భద్రాచలం, మార్చి 3: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలో సీతారామచంద్రస్వామి ఆలయంలో హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని ఈ నెల 14న డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం 13న అంకురార్పణ నిర్వహించనున్నారు. అలాగే ఏప్రిల్ 6న దేవస్థానం ఆధ్వర్యంలో మిథిలా స్టేడియంలో నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ సమయంలో పసుపు దంచడం, తలంబ్రాలు కలిపే పనులను చేపట్టనున్నారు. అదేవిధంగా స్వర్ణలక్ష్మి అమ్మవారి సామూహిక పూజను సైతం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను పురస్కరించుకొని స్వామివారి నిత్యకల్యాణాన్ని సైతం నిలిపివేయనున్నారు.

300 క్వింటాళ్లపైనే తలంబ్రాల తయారీ

భద్రాద్రి రామయ్య కల్యాణంలో వినియోగించే తలంబ్రాల తయారీ కార్యక్రమానికి సైతం 14న శ్రీకారం చుట్టనుండగా ఈ ఏడాది 300 క్వింటాళ్లకు పైగా తలంబ్రాలను తయారు చేసేందుకు దేవస్థానం అధికారులు కసరత్తు చేస్తున్నారు. భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణంలో వినియోగించే తలంబ్రాలకు ఎంతో ప్రాముఖ్యత ఉండటంతో ప్రతి ఏటా భక్తుల నుంచి డిమాండ్ పెరుగుతోంది. గత ఏడాది 300క్వింటాళ్ల తలంబ్రాలను వినియోగించారు. కాగా ఈసారి 300 క్వింటాళ్లకు పైనే సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివస్తున్న భక్తులు

శ్రీరామనవమి సమయాన వినియోగించే తలంబ్రాల తయారీకి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివస్తున్నారు. గత రెండు దశాబ్దాలుగా ఈ కార్యక్రమం ఒక ప్రత్యేకతను సంతరించుకుందని చెప్పవచ్చు. తొలినాళ్లలో చిత్రకూట మండపంలో సంప్రదాయబద్ధంగా తలంబ్రాల తయారీ కార్యక్రమం సంస్కృత పండితులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు, అప్పటి అధికారులు శ్రీకారం చుట్టారు. క్రమక్రమంగా ఇందులో పాల్గొనే భక్తుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ఇటీవల కాలంలో మిథిలా స్టేడియం ప్రాంగణంలో తలంబ్రాల తయారీని నిర్వహిస్తున్నారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తలంబ్రాలను కలిపే కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంటు

ప్లీడరుగా సాల్మన్‌రాజ్

భద్రాచలం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అసిస్టెంటు గవర్నమెంటు ప్లీడరు(ఏజీపీ)గా జెట్టి సాల్మన్ రాజ్‌ను ప్రభుత్వం నియమించింది. భద్రాచలం బార్ అసోసియేషన్‌లో సీనియర్ న్యాయవాదిగా పని చేస్తూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో అసిస్టెంటు గవర్నమెంటు ప్లీడరుగా ప్రభు త్వం తరపున పని చేయనున్నారు. సాల్మన్‌రాజ్ నియామకం పట్ల భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం హర్షం వ్యక్తం చేశారు.



పీఆర్టీయూదే విజయం

(5వ పేజీ తరువాయి)

కేంద్రం వద్దకు చేరుకున్నారు. అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ తాళాలు తెరిచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్‌కు తరలించారు. 11.30గంటలకు టేబుళ్ల వారీగా కౌంటింగ్ మొదలుపెట్టారు. మధ్యాహ్నం 3.40లోగా మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తిచేసి, చెల్లని ఓట్లను, చెల్లిన ఓట్లను తేల్చేశారు. మొత్తం 25,197 ఓట్లకుగాను 24,135 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 494 ఓట్లు చెల్లకుండా పోయాయి. 23,641 ఓట్లను లెక్కలోకి తీసుకున్నట్లు ప్రకటించి, కోటా ఓటుగా 11,821 ఓట్లను నిర్ధారించారు. మొదటిప్రాధాన్యత ఓట్లలో ఎవరికీ కోటా ఓటు రాకపోవడంతో లంచ్‌బ్రేక్ తర్వాత 4.15నుంచి ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొదలుపెట్టారు.

చివరివరకు పీఆర్‌టీయూ ఆధిక్యం

ఎలిమినేషన్ ప్రక్రియ మొదలు పెట్టాక అవరోహణ క్రమంలో ఒక్కో అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తూ వారి బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను పోటీలో ఉన్న మిగిలిన అభ్యర్థులకు కలుపుతూ లెక్కింపు కొనసాగించారు. మొత్తం 19 మంది అభ్యర్థుల్లో అతి తక్కువ ఓట్లు వచ్చిన 13 మంది అభ్యర్థులను 14వ రౌండ్‌కు వచ్చేసరికి ఎలిమినేట్ చేశారు. 14వ రౌండ్ ముగిశాక, ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను కలిపాక కూడా పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి 6,165 ఓట్లతో ఆధిక్యతలో ఉండగా, ఆయన తర్వాత యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి 4,946 ఓట్లతో రెండోస్థానంలో, టీపీఆర్‌టీయూ అభ్యర్థి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి 4,596 ఓట్లతో మూడోస్థానంలో ఉన్నారు. పూలరవీందర్ 3,249 ఓట్లతో నాలుగోస్థానంలో, బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి 2,394 ఓట్లతో అయిదో స్థానంలో ఉండగా, బీసీ నినాదంతో బరిలో నిలిచిన మరో అభ్యర్థి సుందర్‌రాజ్ 2,141 ఓట్లతో ఆరోస్థానంలో నిలిచారు. ఈ రౌండ్లు ముగిసేసరికి ద్వితీయ ప్రాధాన్యతలో 150 ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎలిమినేషన్‌లో 15వ రౌండ్ పూర్తయ్యాక 14మంది అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. ఈ రౌండ్ పూర్తయ్యాక కూడా పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డికే ఆధిక్యత కొనసాగింది. 16వ రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డిని ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన ఓట్లలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. నాలుగోస్థానంలో ఉన్న పూలరవీందర్ ఎలిమినేషన్ తర్వాత 17వ రౌండ్ లెక్కింపు ముగిశాక హర్షవర్ధన్‌రెడ్డికి 6,034 ఓట్లు దక్కాయి. రెండోస్థానంలో ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డికి 6,448 ఓట్లు, మొదటి స్థానంలోనే ఉన్న శ్రీపాల్‌రెడ్డి 9,021 ఓట్లు సాధించారు. పూల రవీందర్ ఎలిమినేషన్‌లో ఆయన బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో శ్రీపాల్‌రెడ్డికి 1,348 ఓట్లు దక్కగా, నర్సిరెడ్డికి 7,88 ఓట్లు, హర్షవర్ధన్‌కు 725 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ఈ రౌండ్‌లోనూ శ్రీపాల్‌రెడ్డికే ఆధిక్యత దక్కింది. ఈ రౌండ్ తర్వాత కూడా కోటా ఓటు రాకపోవడంతో 18వ రౌండ్ హర్షవర్ధన్ ఎలిమినేషన్ కొనసాగింది. ఈ రౌండ్‌లో 1,956 ఓట్లు చెల్లకుండా పోయాయి. ఈ రౌండ్‌లో శ్రీపాల్‌కు 2,078, నర్సిరెడ్డికి 2000 ఓట్లు వచ్చాయి. మొత్తంగా 11,099 ఓట్లతో ప్రథమస్థానంలో శ్రీపాల్, 8,448 ఓట్ల తో నర్సిరెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. చివరికి బరిలో ఇద్దరు అభ్యర్థులే ఉన్నా, కో టా ఓటు ఎవ్వరికీ రాకపోడంతో 19వ రౌండ్‌లో నర్సిరెడ్డి ఎలిమినేషన్ కొనసాగింది. ఈ రౌండ్‌లో 5,578 ఓట్లు చెల్లకుండా పోయాయి. ఈ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డికి 2,870 ఓట్లు రాగా, మొత్తం 13,969 ఓట్లతో ఆయన కోటా ఓటును మించారు. దీంతో శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించినట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

యాసంగి పంటలను కాపాడాలి

» వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

ఖమ్మం కలెక్టరేట్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటలను సంరక్షించేలా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లకు దిశానిర్ధేశం చేశారు. సోమవారం హైదరాబాద్ నుంచి యాసంగి పంటలకు సాగునీటి సరఫరా, గురుకులాల్లో రెగ్యులర్‌గా తనిఖీలు, ప్లాస్టిక్ ఫ్రీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాబోయే 10 రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గురుకులాల్లో రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తూ పిల్లలకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నా రు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పంటలను సంరక్షించేలా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకొని రాబోయే 10 రోజుల పాటు అప్రమత్తంగా ఉంటూ నీటి సరఫరా పర్యవేక్షించాలని, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా లోటు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ వాసంతి, ఎం.వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఎస్ఈశ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎంవీ. మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా మధ్యాహ్న భోజన చెల్లింపులకు చర్యలు

» విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

కొత్తగూడెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ ద్వార మధ్యాహ్న భోజన చెల్లింపులకు చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యాశాఖ సంచాలకుల నర్సింహారెడ్డిలు అన్నారు. సోమవారం మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపుపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ ట్రెజరీ ద్వారా మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు ప్రక్రియ ఆలస్య అవుతుందని, నేరుగా ఆన్‌లైన్ నుంచే మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించేందుకు అవకాశాలను విద్యాశాఖ పరిశీలిస్తుందన్నారు. రాష్ట్రంలో ముందస్తుగా భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపు ప్రారంభిస్తున్నామన్నారు.

ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనపథకం నిర్వహణలో భాగంగా వివిధ రకాల రిపోర్టులు ఉంటాయని, అవి ప్రస్తుత యాప్‌లో ఒకేసారి జనరేట్ అయ్యే విధంగా లేవని, నెలవారి సంగ్రహక రిపోర్టు ఆధారంగా బిల్లులు వాటికవే జనరేట్ అయ్యే విధంగా ప్రత్యేక ప్యాకేజీ మధ్యాహ్న భోజన పథకం యాప్‌ను మెరుగుపర్చాలని సూచించారు. దానికి గాను విద్యాశాఖ కార్యదర్శి సంతృప్తి వ్యక్తపర్చి యాప్ రూపొందించే దిశలో కృషి చేయాలని తెలిపారు. విద్యాశాఖాధికారి వెంకటేశ్వర చారి, కొత్తగూడెం ఎంఈవో డాక్టర్ ప్రభుదయాల్, ఎఫ్‌వో శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

» భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పురోగతిపై అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వి. విద్యాచందన, పంచాయతీ, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్, రెవెన్యూశాఖాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వార సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలన్నారు. పంచాయతీ రెవెన్యూ, నీటి పారుదలశాఖాధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పరిశీలన పక్రియ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని, జిల్లాలోని వివిధ గ్రామాల్లో తక్కువ సంఖ్యలో పెండింగ్‌లో ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను మూడు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

అద్దె భవనాలు ఇంకెన్నాళ్లు..

» అందుబాటులో కేవీసీఎం భవనాలు ఉన్నా.. పట్టించుకోని అధికారులు » ఏటా రూ.కోటికిపైగా అద్దె చెల్లింపు



రెబ్బవరంలో రెండు గురుకులాలు నిర్వహిస్తున్న అద్దె భవనం

వైరా, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కిందట ముందుచూపుతో వైరాలోని ప్రముఖులు సమకూర్చిన కోట్లాది రూపాయల విలువైన స్థలాలు, వాటిలో నిర్మించిన భవనాలు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. రెండున్నర దశాబ్దాలపాటు ఈ భవనాల్లో డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీలు నడిచాయి. చివరికి నిర్వహణ లోపంతో ఈ స్థలాలు, భవనాల వ్యవహారాలు చూసిన కొండబోలు వెంకయ్య చౌదరి మెమోరియల్ ట్రస్టు ఛైర్మన్ కొండబోలు రవికుమార్, పాలకవర్గ సభ్యులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సహకారంతో వాటిని ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. ప్రస్తుతం కోట్లాదిరూపాయల విలువైన స్థలాలు, భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిలో ప్రభుత్వం పలుచోట్ల ఉన్న వివిధ గురుకులాలను నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అయితే ఇంతవరకు ఆదిశగా కనీస చొరవ, చర్యలు చేపట్టే విషయంలో అధికార యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవు.



ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కేవీసీఎం భవనాలు

ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న గురుకులాలు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాల స్థాయిలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలలు, మైనార్టీ, గిరిజన బాలుర, బాలికల పాఠశాలలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వైరా నియోజకవర్గంలో మునలిమడుగు, వైరా పేరుతో రెండు బీసీ బాలికల గురుకుల పాఠశాలలు మండలంలోని రెబ్బవరం గ్రామంలోని ఓ మిషనరీ సంస్థకు చెందిన ఒక పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రతినెలా ఈ భవనానికి లక్షలాదిరూపాయల అద్దె చెల్లిస్తున్నారు. మునలిమడుగు బీసీ గురుకులంలో 600మంది, వైరా బీసీ గురుకులంలో 400 మందికిపైగా మొత్తం వెయ్యిమంది విద్యార్థినులు ఒకే భవనంలో విద్యనభ్యసిస్తున్నారు.

అద్దె భవనాల్లో వసతులు కరువు...

ఈ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో గత ఏడాది జూలైలో విద్యార్థులు ఆందోళన చేశారు. విద్యార్థినుల రక్షణకు సంబంధించి కనీస ప్రహరీ లేదు. ఈ భవనానికి మూడువైపులా పొలాలున్నాయి. శిథిలావస్థలో స్నానాల గదులు, మరుగుదొడ్లు ఉన్నాయి. ఇంతమంది విద్యార్థులకు ఒకే డైనింగ్ హాల్ ఉంది. దాంతో రెండురోజులపాటు ఇక్కడ విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేశారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఈ పాఠశాలను సందర్శించి ప్రత్యామ్నాయ భవనాలు చూసి ఈ గురుకులాలను ఆభవనాల్లోకి తరలిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఇకపోతే మైనార్టీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కారేపల్లిలోని ఒక విద్యాసంస్థకు చెందిన అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ 670మందికిపైగా విద్యార్థినులు ఉన్నారు. ఆభవనానికి ప్రతినెలా లక్షలాదిరూపాయల అద్దె చెల్లిస్తున్నారు. బీసీ బాలుర గురుకుల పాఠశాల ఖమ్మానికి సమీపంలోని ఓ ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నారు. 400మందికిపైగా విద్యార్థులున్నారు. ఈ భవనానికి ప్రతినెలా లక్షలాదిరూపాయల అద్దె చెల్లిస్తున్నారు. ఈ నాలుగు గురుకులాలకుగానూ ప్రతి ఏటా రూ.కోటికిపైగానే ప్రభుత్వం అద్దెలు చెల్లిస్తుంది.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో వైరా ప్రాంతంలో తమ ప్రాంత విద్యాభివృద్ధి కోసం విరాళాలు సేకరించి అనేక ఎకరాల భూములను సమీకరించారు. దాదాపు రూ.30కోట్ల విలువైన ఆస్తులున్నాయి. ఈ ఆస్తులు కేవీసీఎం ట్రస్టు పేరుతో ఉన్నాయి. వాటిని గత ఏడాది ప్రభుత్వానికి అప్పగించారు. ఈ స్థలాలు, భవనాల్లో ప్రభుత్వం విద్యాసంస్థలను కొనసాగించాలని తమ తండ్రి మధిర తొలి ఎమ్మెల్యే కొండబోలు వెంకయ్యచౌదరి పేరిట ఉన్న కేవీసీఎం ట్రస్టును కొనసాగించాలని ఆయన విగ్రహాన్ని యథావిధి స్థానంలోనే ఉంచాలనే షరతులతో ఛైర్మన్ రవికుమార్ కోట్లాదిరూపాయల విలువైన స్థలాలు, భవనాలను ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. ఆస్తులను స్వాధీనం చేసుకుంటూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా ప్రకటించింది. ప్రస్తుతం విశాలమైన ఈ భవనాలన్నీ నిరుపయోగంగా పడి ఉన్నాయి. వీటిలో రెండు బీసీ బాలికల గురుకులాలను, ఒక మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలను నిర్వహించేందుకు అనుకూలమైన వాతావరణం, సౌకర్యాలున్నాయి. ప్రభుత్వం కొద్దిపాటి వసతులు ఏర్పాటుచేసి విశాలమైన స్థలం, భవనాల్లో వైరా నడిబొడ్డున ఈ మూడు గురుకులాలను నిర్వహించుకొనేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రతి ఏటా అద్దె భవనాలకు చెల్లించే రూ.కోటికిపైగా నిధులు కూడా ఆదా అవుతాయి. తల్లిదండ్రులు, విద్యార్థుల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదిశగా ఆలోచించి నిరుపయోగంగా ఉన్న ఈ భవనాల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న గురుకులాలను ఏర్పాటుచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమయం పాటించకుంటే చర్యలు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

» డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

జూలూరుపాడు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది పనితీరు సక్రమంగా లేదని, సమయపాలన పాటించకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిచడంపై డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్ నాయక్ అన్నారు. సోమవారం జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉదయం 10గంటలైనా ఓ వైద్యురాలు, ఏఎన్ఎం విధులకు హాజరు కాకపోవడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి ఆవరణను, ల్యాబ్‌ను పరిశీలించారు. రికార్డులను, రిజిష్టర్లను తనిఖీ చేశారు. సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని వైద్యాధికారి వెంకటేశ్వర్లుకి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం సమీపించడంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆసుపత్రిలో, ఆరోగ్య ఉపకేంద్రాలలో అందుబాటులో ఉంచి ప్రజలకు పంపిణీ చేయాలన్నారు. సిబ్బంది స్థానికంగా లేకున్నా, వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు బి.వెంకటేశ్వర్లు, తేజస్విని, మౌనిక, సీహెచ్‌వో రామకృష్ణ, సిబ్బంది వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

మార్క్సిజాన్ని ప్రజలతో మమేకం చేసిన యోధుడు రవన్న

» మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మార్క్సిజాన్ని ప్రజలతో మమేకం చేసి, మైదాన ప్రాంత ప్రజల హక్కుల కోసం విరోచితంగా పోరాటాలు చేసిన యోధుడు రాయల సుభాష్ చంద్రబోస్ ఆలియాస్ రవన్న ఉద్యమకారుల చరిత్రలో నిలిచిపోయారని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పేర్కొన్నారు. రాయల సుభాష్‌చంద్రబోష్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడారు. మార్చి 9న రవన్న వర్ధంతి సభను ఖమ్మంలో నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ఈ సమావేశంలో రవన్న ట్రస్ట్ నిర్వహకుడు గుర్రం అచ్చయ్య, పునులూరి నరేందర్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు జి. రామయ్య, సీవై పుల్లయ్య, అశోక్, వెంకన్న, వెంకయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య,

చండ్రుగొండలో జోరుగా మిర్చి కొనుగోళ్లు



లారీలో మిర్చి బస్తాలను లోడ్ చేస్తున్న దృశ్యం

చండ్రుగొండ, మార్చి 3: ఢిల్లీ ప్రాంతానికి చెందిన వ్యాపారులు నేరుగా రైతుల నుంచి మిర్చిని కొనుగోలు చేస్తుండటంతో మండలంలోని మిర్చి సాగు చేసిన రైతులు కొంతవరకు ఊరట పొందుతున్నారు. మండలంలో పత్తి, వరి తరువాత అత్యధికంగా మిర్చి సాగు అవుతుంది. మిర్చి పంటను స్థానిక దళారులకు అమ్ముకోవడం లేదా వ్యయ ప్రయాసలతో ఖమ్మం తదితర ప్రాంతాలలోని మార్కెట్లకు తరలించి విక్రయించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలోనే మార్కెట్ మాయాజాలనికి, దళారుల దోపిడికి రైతులు గురై తీవ్రంగా నష్టపోతున్నారు. ఎన్నడూ లేనివిధంగా ఉత్త ర భారతానికి చెందిన వ్యాపారులు స్థానికంగా కొందరి వ్యక్తుల సహాయంతో నేరుగా రైతులతో మాట్లాడి రూ.12,700 చెల్లించడంతో పాటు అ ప్పటికప్పుడు నగదును రైతుకు అందజేస్తున్నారు. దీంతో అత్యధిక రైతులు ఢిల్లీ వ్యాపారులకు మిర్చిని విక్రయించేందుకు ముందుకు వస్తున్నారు. ఢిల్లీ వ్యాపారుల రంగ ప్రవేశంతో రైతుకు కొంత ఊరట లభిస్తుందని పలుగ్రామాల రైతులు తెలిపారు.

భూ వివాదంలో కత్తులతో పరస్పర దాడులు

» నలుగురికి తీవ్రగాయాలు



గాయపడిన ఏసుబాబు, వెంకటేశ్వరరావు, వెంకమ్మ

దమ్మపేట,మార్చి3(ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల మధ్య భూవివాదం కారణంగా ఇరువర్గాలు కత్తులతో దాడులు చేసుకున్నాయి. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈఘటన దమ్మపేట మండలంలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని చినగొల్లగూడెంలో కొలూరి ముత్తారావు, కొలూరి వెంకటేశ్వరావు మధ్య ఆరు ఎకరాలకు సంబంధించి భూవివాదం ఉంది. వీరు వరసకు సోదరులు.. దీనిపై పలుమార్లు పంచాయతీలు కూడా నడిచినట్లుగా సమాచారం. ఇదే సమయంలో సోమవారం కొలూరి ముత్తారావు పొలంలో ఉన్న ఫెన్సింగ్‌ను వెంకటేశ్వరావు మరికొంతమందితో కలిసి వెళ్లి తొలిగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ముత్తారావు సోదరుడు సంజీవరావు, వెంకమ్మ, ఏసుబాబుతో పాటు మరో ఇద్దరు పొలం వద్దకు వెళ్లారు. ఫెన్సింగ్‌ను తొలగించేందుకు వచ్చే ముందే కత్తులు, గొడ్డళ్లు తెచ్చుకున్నారు. ఫెన్సింగ్ తొలిగిస్తుండగా అడ్డుకోవటంతో ఇరు వర్గాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది.పరిస్థితి విషమించి ఒకరిపై ఒకరు కత్తులు,గొడ్డళ్లతో దాడులకు పాల్పడ్డారు. ఘటనలో సంజీవరావు, వెంకమ్మ,ఏసుబాబు, వెంకటేశ్వరావుకు తీవ్రంగా గాయాలు కాగా మరి కొంతమందికిగాయాలు అయ్యాయి. గాయపడిన వారిని స్థానికంగా చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. సంఘటన స్థలాన్ని సీఐ కరుణాకర్ సందర్శించి వివరాలు సేకరించారు. ఘటనపై ఇరు వర్గాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దురంతో ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

రైల్వేట్రాక్‌పైకి వచ్చిన ట్రాక్టర్

గమనించి బ్రేక్ వేసిన లోకోపైలట్

చింతకాని, మార్చి3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురం రైల్వేగేట్ సమీపంలో 'దురంతో' ఎక్స్‌ప్రెస్‌కు సోమవారం మధ్యాహ్నంత్రుటిలో ప్రమాదం తప్పింది. మద్రాస్ నుంచి నిజాముద్దీన్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు చింతకాని మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ దాటుతున్న సమయంలో అక్కడ మూడో రైల్వేలైన్ పనుల జరుగుతుండటంతో ట్రాక్టర్ ఒక్కసారిగా రైల్వేట్రాక్‌పైకి వచ్చింది. ట్రాక్‌పై ట్రాక్టరును గుర్తించిన లోకోపైలెట్ సడన్ బ్రేకులు వేసి రైలు వేగాన్ని నియంత్రించడంతో ప్రమాదం తప్పింది. రైలు దగ్గరకు వచ్చిన సమయంలో ట్రాక్టర్ రైల్వేట్రాక్‌ను దాటడంతో ప్రమాదం తప్పింది. ఘటనపై ఖమ్మం రైల్వే సీఐశ్రీనివాస్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌గా భావిస్తున్నారు.

మద్యంలో తేలుతూ.. విధుల్లో తూలుతూ

» ఎంఈవో విచారణలో బైటపడిన ఉపాధ్యాయుడి లీలలు

» దమ్మక్కపేటలో సస్పెన్షన్



విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న ఎంఈవో

మణుగూరురూరల్,మార్చి3(ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు నిత్యం మద్యం తాగి విధులు వస్తున్నాడు.. అంతేకాక విధుల్లో తూలూతూ ఉండటం నిత్యకృత్యంగా మారింది. ఈనేపథ్యంలో విచారణ నిర్వహించి సదరు ఉపాధ్యాయుడిపై సస్పెషన్ వేటు వేశారు. మణుగూరు మండలంలోని దమ్మక్కపేటలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బానోతు బాలాజీ నిత్యం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. నిత్యం మద్యం తాగి విధులకు వస్తుండేవాడు. ఈక్రమంలో ఈ సారు మా కొద్దు మేడమ్ అంటు విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు మణుగూరు ఎంఈవో స్వర్ణజ్యోతి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారు మా కొద్దు అంటూ ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ఓ కథనం ప్రచురితమైంది. ఈ విషయంపై స్పందించిన జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మణుగూరు ఎంఈవో స్వర్ణజ్యోతి సోమవారం మణుగూరు మండలంలోని దమ్మక్కపేటలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుడు బాలాజీ పనితీరుపై విద్యార్థులను, విద్యార్థుల తల్లితండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఆయనపై వారు పలు ఫిర్యాదులు చేశారు. విధులకు రాడని, వచ్చినా మద్యం మత్తులో తూలుతూ వస్తాడని ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. సదరు ఉపాధ్యాయుడపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఈవో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడు బాలాజీ పనితీరుపై గతంలో కూడా ఫిర్యాదులు వచ్చాయని నవంబర్‌లో నోటీసులు కూడా జారీ చేశామన్నారు. ఎటువంటి అనుములు తీసుకోకుండా నిత్యం గైర్హాజరవుతున్నాడని తెలిపారు. సోమవారం విచారణకు వస్తున్నట్లు ముందే సమాచారం తెలిసినప్పటికీ సదరు ఉపాధ్యాయుడు రాలేదని ఎంఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ నివేదికను జిల్లా విద్యశాఖ అధికారి వెంకటేశ్వరాచారికి అందజేశారు. ఆయన బాలాజీ సస్పెండ్ చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఏదులాపురం మునిసిపాలిటి పరిధిలోని వెంకటగిరి ఇందిరమ్మ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది.రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. వెంకటగిరి ఇందిరమ్మ కాలనీ-2కి చెందిన బండారి వెంకటేశ్వర్లు(54) స్నానానికి నీళ్ల వేడిచేసుకునేందుకు వాటర్‌హీటర్ ఆన్‌చేశాడు. అనంతరం స్విచ్ ఆఫ్ చేయకుండా హీటర్‌ను తీసే క్రమంలో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

పోలీసుల అదుపులో నలుగురు వలస కూలీలు ?

జూలూరుపాడు, మార్చి3(ఆంధ్రజ్యోతి): మిర్చికోతల పనుల కోసం జూలూరుపాడు మండలానికి వచ్చిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన నలుగురు వలస కూలీలను జూలూరుపాడు పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మండలంలోని కాకర్లకు చెందిన రైతు చేలో మిర్చి కోతల పనులను చేపట్టేందుకు వీరు వచ్చారు. నక్సల్స్‌కు ఇన్‌ఫార్మర్లుగావ్యవహరిస్తున్నరన్న అనుమానంతో మొద్దులగూడెం సమీపంలోని వారి గుడారాల వద్దకు వెళ్లిఇద్దరు యువతులు, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని సమాచారం.

14మంది మావోయిస్టుల లొంగుబాటు

» భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్



వివరాలను వెల్లడిస్తున్న భద్రాద్రి ఎస్పీ

కొత్తగూడెం, మార్చి3(ఆంధ్రజ్యోతి): నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 14మంది మావోయిస్టు సభ్యులు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ సమక్షంలో లొంగిపోయారు. ఈ మేరకు ఎస్పీ రోహిత్‌రాజ్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.జిల్లాపోలీసులు, 81బెటాలియన్, 141బెటాలియన్, సీఆర్‌పీఎఫ్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఆపరేషన్ చేయూత కార్యక్రమాలు, లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తెలుసుకుని, తాము కూడా కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించాలని ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందిన వివిధ క్యాటగిరీలకు సంబంధించిన 14మంది మావోయిస్టులు లొంగిపోయారని ఎస్పీ వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగలతోడు గ్రామానికి చెందిన యర్రపల్లి ఆర్పీసీ మిలీషియా కమాండర్, వివిధ పదవులకు చెందిన మడవి భీమా, సోడి ఉంగా, మడవి అడుమ, కుంజామ్ పోసా, పోవాల్సి నందా, మడవి భీమా, మడవి మాసా, కుంజాం లక్మా, వెట్టి లక్కె, మడవి చుక్కయ్య, వెట్టి కోసా, మడవి భీమా సోడి రాధిక, కుహరాని కాజల్‌లు లొంగిపోయారని ఎస్పీ వివరించారు. ఈ రెండు నెలల కాలంలో 44మంది మావోయిస్టులు భద్రాద్రి జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే కుటుంబసభ్యుల ద్వారా కానీ స్వయంగా కానీ దగ్గరలోని పోలీస్ స్టేషన్లు, లేదా జిల్లా ఉన్నతాధికారుల వద్ద కానీ లొంగిపోయేందుకు సంప్రదించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన దళసభ్యులకు జీవనపాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం ద్వారా జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో కొత్తగూడెం ఓఎస్డీ పంకజ్ పరితోష్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్‌సింగ్, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, చర్ల సీఐ రాజువర్మ, సీఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణ భూమి స్వాధీనం



బోర్డు ఏర్పాటుచేస్తున్న ఆర్ఐ ప్రసాద్

ఖమ్మంరూరల్,మార్చి3(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని సర్వే నంబర్ 87లోని 5ఎకరాల ప్రభుత్వ భూమి ఖబ్జాకు గురైంది. స్థానికులు ఫిర్యాదు మేరకు విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అట్టి భూమిలో ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారు. ఈ భూమిని 2004లోనే అప్పటి తహసీల్దార్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కొందరు ఆక్రమించుకున్నారు. ఈవిషయం తెలుసుకున్న తహసీల్దార్ రాంప్రసాద్ స్వాధీనం చేసుకుని బోర్డు ఏర్పాటు చేశారు. ఈ భూమి విలువ ప్రస్తుత మార్కెట్‌లో సుమారు రూ.10 కోట్ల ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, వీఆర్ఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.2 కోట్లకు ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరానికి చెందిన కొదుమూరు శ్రీనివాసరావు రూ.2కోట్ల48లక్షల 80వేలకు దివాళాపిటీషన్ దాఖలుచేశాడు. ఫిర్యాదిదారుడు బియ్యం వ్యాపారం నిమిత్తం అధిక వడ్డీలకు అప్పులు చేశాడు. వ్యాపారంలో నష్టం రావటంతో రుణదాతలనుంచి ఒత్తిడి తీవ్రం కావటంతో 64 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాదులు కోనా చంద్రశేఖర్‌గుప్తా, పి.శరణ్య, పి.సాయికిరణ్ ద్వారా సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ఐపీ దాఖలు చేశాడు.

పోలీసు సిబ్బందికి వైద్యపరీక్షలు

ఖమ్మంక్రైం, మార్చి3(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బందికి సంక్షేమ కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని పరేడ్‌మైదానంలో ఓదంత వైద్యశాల ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన సూచనలు చెప్పారు. ఈసందర్భంగా ఏఆర్ఏసీపీ నరసయ్య మాట్లాడుతూ నిరంతరం పని వత్తిడితో ఉండే సిబ్బంది శ్రేయస్సుకు ఈశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పనులు ఆపాలని రైతు ఫిర్యాదు

చింతకాని, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలిపి వేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా పనులు కొనసాగిస్తుండటంతో బాధిత రైతు గుగ్గిళ్ల భారతమ్మ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని పాతర్లపాడు నుంచి పొద్దుటూరు వరకు రోడ్డు నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. తమ పొలంలో పనులు నిలిపివేయాలంటూ రైతు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే ఇచ్చింది. కొన్ని రోజులు పనులు నిలిపివేసినా, కాంట్రాక్టర్ ఆదివారం పనులు చేస్తుండటంతో ఫిర్యాదు చేశారు.

31 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజులో 25శాతం రాయితీ

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి3(ఆంధ్రజ్యోతి): భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య కోరారు. ఈ మేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2020లో రూ.1,000ఫీజు చెల్లించిన ప్లాట్ యజమానులకు ప్రభుత్వం రాయితీని ప్రకటించిందన్నారు. ఖాళీస్థలాలను క్రమబద్ధీకరించుకునే ఫీజులో 25శాతం వరకు రాయితీ ఇవ్వటం జరుగుతుందని, మార్చి 31లోపుగా ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవ వేడుకల వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ముజామిల్‌ఖాన్ సోమవారం తనచాంబర్‌లో ఆవిష్కరించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఉషశ్రీ, కార్యదర్శి పి సుధారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరించారు. మహిళలు జిల్లాలో వివిధ విభాగాలలో సమర్థవంతంగా వారి బాధ్యతలు నిర్వహిస్తున్నారని అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మార్చి 8న వివిధ క్రీడల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు, గెజిటెడ్ అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్వో పద్మశ్రీ, టీజీవో జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి మోదుగు వేలాద్రి , ట్రెజరర్ కే శేషు ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి పి విజయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సూరంపల్లి రాంబాబు, వై మంజుల సంయుక్త కార్యదర్శి, కె.విజయలక్ష్మి ఆర్గనైజింగ్ సెక్రటరీ, బి.శారద పబ్లిసిటీ సెక్రటరీ, డీపీవో ఆశాలత, డీఎంహెచ్‌వో కళావతి బాయ్, డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ బీసీ అభివృద్ధి సంక్షేమ అధికారి, ఎస్ మాధవి, మిషన్‌భగీరథ ఈఈ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

కేఎంసీలో కమిషనర్ అభిషేక్ అగస్త్య, విద్యుత్‌శాఖలో ఎస్ఈ శ్రీనివాసాచారి ఫిర్యాదుల స్వీకరణ



దివ్యాంగుడి వినతిని పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఖమ్మం నగర పాలక సంస్థలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి బాధితులు, ప్రజల నుంచి ఫిర్యాదుల వెల్లువ కనిపించింది. రహదారులను ఆక్రమించి నిర్మాణం చేసిన కట్టడాలను తొలగించాలని, ఒకే ఇంటికి రెండు ట్యాక్స్ నోటీసులు వచ్చాయని, తాగునీటి కుళాయిలు కావాలని, కుళాయిలు లేకున్న పంపు పన్ను నోటీసులు పంపారని ప్రజలు ఫిర్యాదులు చేశారు. దివ్యాంగులు ఉపాధి చూపించాలని కమిషనర్‌కు విన్నవించారు.రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మున్నేరు వరద సహాయం కోసం ప్రజలు బారులు తీరారు. 1వ డివిజన్‌లోని ఖైకొండాయిగూడెంలోని శివారు గ్రామాలు విద్యానగర్ కాలనీలో వర్షాలు పడితే నడవలేని పరిస్థితి ఏర్పడిందని, అధికారులు పరిశీలించి రహదారులు, డ్రైనేజీలను నిర్మాణం చేయాలని సీపీఐ(ఎంఎల్)మార్క్సిస్ట్ లెనినిస్ట్ 1వపట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు కే శ్రీనివాస్, శిరోమణి, ఇమ్మడి వెంకటేశ్వర్లు, భరత్, లెనిన్, బొమ్మకంటి రమేశ్, ధరణ్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

విద్యుత్ ప్రజావాణిలో 1,018 ఫిర్యాదుల పరిష్కారం

ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలో ఇప్పటి వరకు 1,018 ఫిర్యాదులు పరిష్కరించామని ఖమ్మం విద్యుత్‌శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2024జూన్ 17నుంచి విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లాలోని ఎస్ఈ కార్యాలయం సబ్ డివిజన్, డివిజన్ కార్యాలయాల్లో నిర్వహించగా ఇప్పటి వరకు 1,345 ఫిర్యాదులు అందాయని వాటిలో 1,018 పరిష్కారం చేశామన్నారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు నిర్భయంగా ఫిర్యాదులు చేయాలని ఎస్ఈ కోరారు.

ప్రతీగ్రామంలో సీసీ రోడ్లు

తిరుమలాయపాలెం, మార్చి3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్లు ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ నాయకులు తుంబూరు దయాకరరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఎర్రగడ్డ, తిరుమలాయపాలెం గ్రామాలలో ఆయన పర్యటించారు. తిరుమలాయపాలెంలో సీసీ రోడ్ల పనులను వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు.ఈకార్యక్రమంలోఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఓర నాగరాజు, లింగయ్య, కె. వెంకటేశ్వర్లు,మద్దినేని హరినాద్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తిరుమలాయపాలెం, మార్చి3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతర్లపాడు స్టేజీ వద్ద సయ్యద్ మదార్‌సాహెబ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎస్ఐ జగదీష్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఎస్‌డీ ఇమాం, ఇమామ్, సైదా, చిన్నసైదా, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌పరీక్ష కేంద్రాల వద్ద

బీఎన్ఎస్ఎస్163 సెక్షన్ అమలు

» **సీపీ సునిల్‌దత్**

ఖమ్మంక్రైం, మార్చి3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలోజరిగే ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద బుధవారం నుంచి మార్చి 25వరకు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ 2023 అమలులో ఉంటుందని పోలీసుకమిషనర్ సునిల్‌దత్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. 72 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించే ఇంటర్ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 1 గంట వరకు ఈసెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 200మీటర్లదూరంలో గుంపుగా ఉండరాదని,ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైక్‌లు, డీ జేలతో ఊరేగింపులు ఎవరు చేయవద్దని తెలిపారు. పరీక్షా సమయంలో కేంద్రాల పరిసరాలలో ఇంటర్‌నెట్‌సెంటర్లు, జిరాక్సు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నిరుద్యోగులకు పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ

ఖమ్మంఖానాపురంహవేలి మార్చి 3(ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పలువురు నిరుద్యోగులకు సోమవారం ట్రెయినీ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ వివిధ రకాల పోటీ పరీక్షల పుస్తకాలను నగరపాలక సంస్థ తరుపున వితరణగా అందించారు. నగరంలోని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాంధీ లైబ్రరీలో పోటీ పరీక్షలకు వారు సిద్ధమవుతున్నారు. దీంతో నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత టైలరింగ్, బ్యూటీపార్లర్ శిక్షణ

ఖమ్మంరూరల్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తరుణిహట్‌లోని ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు ఈనెల 21నుంచి ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ, ఉచిత బ్యూటి పార్లర్ శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ 30 రోజులు ఉంటుందని, ఉచిత శిక్షణతో పాటు ఉచితంగా యూనిఫార్మ్,ట్రైనింగ్ మెటీరియల్, టూల్ కిట్స్, భోజనం, మరియు వసతి కల్పిస్తామని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 26వరకు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 7842295972 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రెడ్‌నోటీసులకు స్పందించకుంటే

భవనాలు సీజ్ చేస్తాం

» **కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య**

» **ఆదాయ వసూళ్లను క్షేత్రస్థాయిలో తనిఖీ**



కౌంటర్లు వద్ద బిల్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ట్యాక్స్ కలెక్షన్ వసూళ్లపై నిర్లక్ష్యంగా ఉండోద్దని, రెడ్‌నోటీసులకు స్పందించకుంటే ఆయా భవనాలను సీజ్ చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు.సోమవారం ఖమ్మంనగరంలోని ఆదాయ వసూల్లు కౌంటర్లను తనిఖీలు చేశారు. భవనాల యజమానులకు ఆదాయ వసూళ్లపై ఎటువంటి అవగాహన కల్పిస్తున్నారని బిల్ కలెక్టర్లును అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత లక్ష్యాల మేరకు బిల్‌కలెక్టర్లు ట్యాక్స్ కలెక్షన్ చేపట్టాలని ఆదేశించారు. ఎవ్వరైనా నిర్లక్ష్యంగా ఉన్నా ఆదాయ వసూళ్లలో లోపాయికారిగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్చిచివరి నాటికి నూరుశాతం పూర్తి కావాలని ఆదేశించారు.

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్జేడీ

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రాథమిక ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సోమవారం వరంగల్ ఆర్జేడి సత్యనారాయరెడ్డి సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతీ విద్యార్థి పట్ల ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోని బోధన జరగాలన్నారు. ప్రతీ సబ్జెక్టులో కనీస అభ్యసన సామర్థ్యాలు విద్యార్థులు సాధించేలా ప్రణాళిక బద్ధంగా పాఠ్యాంశ బోధన జరగాలని సూచించారు. విద్యా ప్రమాణాలు, అభ్యసన ఫలితాలపై అవగాహన పెంచుకోవాలని, వాటికి అనుగుణంగా పాఠశాలలో బోధన నిర్వహించాలని సూచించారు. పాఠ్యపుస్తకం ఆధారంగా బోధన జరగలన్నారు. అనంతరం నగరంలోని ఎస్ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించి ఫౌండేషన్ లీడర్స్ అండ్ న్యూమరస్ బోధనను పరిశీలించారు. తెలుగు, గణితం నేర్చుకోవటంలో ప్రాథమిక స్థాయి విద్యార్థులు ఎలా కంప్యూటర్ను వినియెగిస్తున్నారో ప్రత్యక్షంగా పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, ఖమ్మం అర్బన్ మండల విద్యాశాఖ అధికారి శైలజ లక్ష్మీ, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవి కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి3 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలచేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ కేవీ కృష్ణారావు కోరారు. ఈమేరకు సోమవారం కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డు మీద రాసి పోస్టుబాక్సులో వేశారు. గతఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ ఉద్యమకారుకుల ఇచ్చిన హామీలు అమలుచేయాలన్నారు.ఉద్యమకారులుక ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరుతూ ఈపోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించామన్నారు. అన్ని జిల్లాలనుంచి ఈ పోస్టుకార్డు ఉద్యమం మొదలుపెట్టామని తెలిపారు. ఈకార్యక్రమంలో పసుపులేటి నాసరయ్య, గుంతేటి వీరభద్రం, పెళ్లూరి విజయ్‌కుమార్, రవి చంద్రచౌహాన్ పాల్గొన్నారు.

ఘనంగా చావా నారాయణరావు పుట్టినరోజు





వేడుకల్లో పాల్గొన్న స్నేహితులు, కేకు తినిపిస్తున్న ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రగర్ల

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు, 14వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చావా నారాయణరావు పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చావా నారాయణరావు నివాసంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్నేహితుల ఆనందోత్సహాల నడుమ చావా కేక్‌కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజలతో తనకున్న మంచి సంబంధాలను గుర్తు చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ప్రజలందరి సహకారంతోనే తాను అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు జానకిరాములు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు మాట్లాడుతూ 10వడివిజన్‌లో కార్పొరేటర్లు చావా నారాయణరావు దంపతులు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు డివిజన్ వరద ముంపునకుగురి కావటంతో రాత్రింబవళ్లు పని చేసి నివాసాల్లోని వరద నీటిని బయటకు పంపారని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో తాళ్లూరి పుల్లారావు, వీరభద్రం, నల్లమోతు రవి, నామా రామ్మోహన్, జానకిరామ్, కొనకంచి రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

ఖమ్మంచర్చికాంపౌండ్: కాంగ్రెస్ నాయకుడు చావా నారాయణరావు జన్మదిన వేడుకలను సోమవారం ఖమ్మంనగర నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. 10వడివిజన్ ఇందిరానగర్, సుదరయ్యకాలనీ వాసులు, నాయీబ్రాహ్మణ సంఘం ఖమ్మంనగర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. నారాయణరావును శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో గుండ్లపల్లి పుణ్యవతి, ఎండీ హుస్సేన్, షేక్ జావీద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం వ్యక్తిత్వ వికాస నిపుణుడు అట్లూరి వెంకటరమణ పదోతరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. విద్యార్థుల నుంచి వెలువడే సింహానాదమే రేపటి ప్రపంచం వినే మాట అని, భవిష్యత్తు నిర్మాతలుగా వారిపై గురుతర బాధ్యత ఉందని వెంకటరమణ అన్నారు. విద్యార్థులు తపన, పట్టుదల, ఏకాగ్రతలతో అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటేలో తెల్దారుపల్లి విద్యార్థుల ప్రతిభ



ఖమ్మంరూరల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మండంలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు మాజీ ఎంపీటీసీ తమ్మినేని మంగతాయమ్మ, మండల కాంగ్రెస్ నాయకులు తమ్మినేని నవీన్ తెలిపారు. తెల్దారుపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 20మంది పోటీలకు హాజరయ్యేందుకు తమ్మినేని నవీన్ ప్రత్యేకంగా ఓ కారును ఏర్పాటు చేశారు. రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన వీరిని మంగతాయి, తమ్మినేని నవీన్ అభినందించారు.

ఎక్సైజ్ సిబ్బందికి పురస్కారాలు



అవార్డు తీసుకుంటున్న శ్రీనివాస్

నేలకొండపల్లి, మార్చి3 (ఆంధ్రజ్యోతి):గంజాయి నిర్మూలనలో ప్రత్యేక ప్రతిభను కనపర్చిన నేలకొండపల్లి ఎక్సైజ్ సిబ్బందికి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్ కమలాసన్ సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ఎక్సైజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డులతో పాటుగా నగదు పురస్కారాలను డైరెక్టర్ కమలాసన్ అందించారు. ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు, కానిస్టేబుల్స్ జె.రామారావు, యం.లాలు, వి.వెంకటేశ్వర్లు, యస్.బలరాం, మహిళా కానిస్టేబుల్ డి.సునీత ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ జగన్నాధరావ అభినందించారు.

ఇన్నోవేషన్‌తోనే భారత్ ముందడుగు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): సైన్స్ రంగంలో అభివృద్ధి సాధించాలంటే నూతన ఇన్నోవేషన్‌లు ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉందని తెలంగాణ అకాడమీ సైన్సెస్ అధ్యక్షుడు, సీసీ ఎండీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ మోహన్‌రావు అన్నారు. సోమవారం నగరంలోని కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలలో సైన్స్‌డే వేడుకల ముగింపు కార్యక్రమానికి ప్రొఫెసర్ సిహెచ్ మోహన్‌రావు, వరంగల్ జోన్ సైన్సెస్ కోఆర్డినేటర్ కే లక్ష్మారెడ్డిలు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వి సాంబశివరావు, కళాశాల చైర్మెన్ ఎం నిరంజన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కెవి రమణారావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తిరుమలాయపాలెం, మార్చి3(ఆంధ్రజ్యోతి): సమాంజలో పెరుగుతున్న సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ డయల్ 100పై అవగాహన కలిగించాలని ఎస్ఐ జగదీష్ తెలిపారు సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సైబర్‌నేరాలపై అవగాహన నిర్వహించారు. తెలియని లింకులు పంపితే ఓపెన్ చేయవద్దన్నారు. వెంటనే 1990 కు కాల్‌చేయాలని తెలిపారు. సెబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈకార్యక్రమంలో కానిస్టేబుళ్ల కిషన్ , సౌజన్య, రాజు, వెంకటేశ్వర్లు, హరీష్ పాల్గొన్నారు.

గూడు లాగేసుకుంటే ఎలా?

కలెక్టరేట్ ఎదుట బాధితుల నిరసన



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి3(ఆంధ్రజ్యోతి): 15ఏళ్ల క్రితం ఆ నాటి ప్రభుత్వం నిరుపేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలను ఇప్పుడు బైబ్యాక్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు వెనక్కి తీసుకుంటున్నారని ఆరోపిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. ఖమ్మంలో వీధుల వెంట ఉంటున్న నిరాశ్రేయులకు రఘునాథపాలెం మండలంలోని శివాయిగూడెం పరిసర ప్రాంతాల్లో 900మంది నిరపేదలకు గతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వాటిని తిరిగి ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని సీపీఎం శ్రేణులు, లబ్ధిదారులతో కలిసి నిరసన చేపట్టి కలెక్టర్ కార్యాలయంలోకి చొచ్చుకేళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పోలీసులకు, సీపీఎం నాయకులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారి తీసింది. తర్వాత నాయకులకు పోలీసులు నచ్చజెప్పటంతో సద్దుమణిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ నిరుపేదల ఇళ్ల స్థలాల జోలికి వస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్తగా ఇళ్ల స్థలాలు ఇవ్వకపోగా నిరుపేదల ఇళ్ల స్థలాలు లాక్కోవాటం సరైంది కాదన్నారు. ప్రజలు గత సరైన సమయంలో సరైన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. నాయకులు యర్రా శ్రీకాంత్, వై విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, ఎస్ నవీన్‌రెడ్డి, భూక్యా వీరభద్రం, ఎంఏ జబ్బార్, మీరాసాహెబ్, నాగుల్‌మీరా, రంజిత్, గుగులోత్ కుమార్ పాల్గొన్నారు.

కేఎంసీ భవనానికి వెంటిలేషన్ ఇక్కట్లు

» **గాలి ఆడక ఉద్యోగులు ఉక్కిరి బిక్కిరి**

» **వాడిపోతున్న మొక్కలు**

» **రూ.30కోట్లతో భవన నిర్మాణం**



వెంటి లేషన్ మూసి ఉంచిన పై కప్పు



వడిపడి ఎండి పోతున్న మొక్కలు

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి3(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి ఇంటి నిర్మాణానికి వెంటిలేషన్ ఉండేలా చూసుకుంటున్న ఈ రోజుల్లో ఖమ్మం నగర పాలక సంస్థ భవనానికి వెంటిలేషన్ ఏర్పాటు చేయకపోవటంతో ఇటు ఉద్యోగులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. రూ.30 కోట్లతో కేఎంసీ కార్యాలయాన్ని ఏ మరియు బీబ్లాక్‌లుగా నిర్మాణం చేశారు. ప్రతీ బ్లాక్‌కు మధ్యలో గార్డెన్‌లను ఏర్పాటు చేశారు. కార్యాలయంలోని గాలిబయటకు వెళ్లేందుకు, బయట గాలి, వెలుతురు లోపలకు వచ్చేందుకు మాత్రం వెంటిలేటేషన్ ఏర్పాటు చేయలేదు. ఫలితంగా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మొక్కలు వాడిపోతున్నాయి. గతప్రభుత్వంలో హడావుడిగా కేఎంసీ కార్యాలయాన్ని ప్రారంభించాలని రెండు బ్లాక్‌లకు వెర్వేరుగా వెంటిలేషన్‌కు ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని పూర్తిగా ప్లాస్టిక్ సీట్‌లతో కప్పి ఉంచారు. దీంతో కేఎంసీ కార్యాలయానికి వెంటిలేషన్ సమస్య ఏర్పడింది. దీంతో కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగులు తీవ్ర ఉక్కపోతకు గురవుతున్నారు. అంతేకాక వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు సైతం పెదవి విరుస్తున్నారు. ఉద్యోగులపనిపై ఇది ప్రభావం చూపుతోంది. మొక్కలు ఎండిపోతున్నాయి. ఈ విషయంపై ఇంజనీరింగ్ అధికారి కృష్ణలాల్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



ఘనంగా పంచగవ్యాభిషేకం



ప్రతిష్ఠ విగ్రహాలకు పంచగవ్యాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

సత్తుపల్లి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా సోమవారం యాగశాల వద్ద (ఋగ్వేద ద్వారం) ప్రతిష్ఠా విగ్రహాలకు పంచగవ్యాభిషేకం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాచార్యులు శ్రీమాన్ ప్రతాపురం గిరిధరాచార్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా 22మంది రుత్వికులచే చతుస్థానార్చన, బాలబోగ నివేదన, విశేషహోమాలు, జపములు, పారాయణాదులు, నిత్య పూర్ణాహుతి సాగాయి. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, చతుస్థానార్చన, ప్రతిష్ఠ మూర్తులకు క్షీరాధివాసం, అధివాస హోమం, తీర్థప్రసాద వితరణ చేయగా సాయంత్రం గో పూజలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. నేడు ఏకనామం ముగింపుతో పాటు లచ్చన్నగూడేనికి చెందిన శ్రీ పత్తేవరపు వెంకట శ్రీనివాసరావు శిష్యబృందంచే హనుమాన్‌చాలీసా పారాయణం సాగనుందని, ఈనెల 9న జరిగే ప్రతిష్ఠా మహోత్సవానికి లక్షలాదిగా తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

31 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజులో 25శాతం రాయితీ

▸▸ కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి3 (ఆంధ్రజ్యోతి): భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య కోరారు. ఈ మేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2020లో రూ.1,000ఫీజు చెల్లించిన ప్లాట్ యజమానులకు ప్రభుత్వం రాయితీని ప్రకటించిందన్నారు. ఖాళీస్థలాలను క్రమబద్ధీకరించుకునే ఫీజులో 25 శాతం వరకు రాయితీ ఇవ్వడం జరుగుతుందని, మార్చి 31లోపుగా ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేటి నుంచి ఇసుక కూపన్ల జారీ

ముదిగొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలో పెద్దమండవ, గంధసిరి మున్నేరుల్లో ఇసుకను తోలుకునేందుకు మంగళవారం నుంచి ఇసుక కూపన్లను జారీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ తెలిపారు. ముదిగొండ తహసీల్దార్ పేరు మీద బ్యాంకులో డీడీలు చెల్లించి అట్టి డీడీ కాపీని దరఖాస్తుతో జతచేసి తమకు అందజేసి కూపన్లు తీసుకువెళ్లాలన్నారు. ఒక ట్రాక్టర్ ట్రిక్కు ఇసుకకు రూ.1,500చెల్లించాలన్నారు. రోజుకు ఒక ట్రాక్టర్‌కు ఒక కూపన్ మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. కూపన్లను ఆసరాగా చేసుకొని ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ హెచ్చరించారు.

మహాదేవ శివాలయ జాతర ఆదాయం రూ.7.62 లక్షలు

కల్లూరు, మార్చి3 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రం (అప్పయ్యస్వామి శివాలయం)లో శివరాత్రి జాతర హుండీ లెక్కింపు ఆదాయం రూ.7.62 లక్షలు వచ్చింది. సోమవారం శివాలయంలో ఖమ్మం డివిజన్ దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.

గత ఏడాది హుండీ ఆదాయం రూ. 5.94 లక్షలు రాగా, ఈ ఏడాది రూ.1.87 వేలు ఆదాయం పెరిగిందని ఆలయ మేనేజర్ ఎస్‌వీడీ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, చైర్మన్ ఎం. వెంకటేష్, అర్చకులు సురేష్‌శర్మ, కమిటీ సభ్యులు పి. శివకృష్ణ, ఏ. యుగంధర్, పి. నర్సింహారావు, కిష్టంశెట్టి కొండలు, ఆలయసేవకులు, మహిళ భక్తులు పాల్గొన్నారు.

'ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి'

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రాథమిక ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సోమవారం వరంగల్ ఆర్జేడి సత్యనారాయరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోని బోధన జరగాలన్నారు. ప్రణాళిక బద్ధంగా పాఠ్యాంశ బోధన జరగాలని సూచించారు. విద్యా ప్రమాణాలు, అభ్యసన ఫలితాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

అంతా మా ఇష్టం

▸▸ రైతుల పొలాల్లో మట్టి తోలకం పనులు చేపట్టిన కాంట్రాక్టర్

▸▸ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్న రైతులు



రైతు పొలంలో తీసిన కందకం

చింతకాని, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా రైతుల పొలాల్లో భారీగా కందకాలు తీసి మట్టిని రోడ్డు నిర్మాణాలను వినియోగిస్తున్నారు. ఇదేమిటని రైతులు ప్రశ్నిస్తే మా ఇష్టమని సమాధానాలు ఎవరికీ చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరిస్తున్నట్లు బాధిత రైతులు వాపోతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తోలకాలు

రోడ్డు నిర్మాణ పనులకు అవసరమయ్యే మట్టిని కాంట్రాక్టర్ ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి నిర్మాణ పనులకు వినియోగించాల్సి ఉంది. దీనికి కూడా నాణ్యమైన ఎర్ర మట్టిని మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. కాని రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా రైతుల పొలాల్లో నాలుగు నుంచి ఆరు అడుగుల లోతు కందకాలు తీసి అందులో మట్టిని రోడ్డు నిర్మాణానికి వినియోగిస్తున్నాడు. ఇదేమిటని ప్రశ్నించి అడ్డుకున్న రైతులను వారు పొలాల్లో వద్ద లేని రాత్రి సమయంలో ఎక్స్‌కవేటర్లతో కందకాలు తీసి మట్టిని వినియోగిస్తున్నాడు. కాంట్రాక్టర్ ఇష్టారీతిన వ్యవహరిస్తుండటంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. సదరు కాంట్రాక్టర్‌పై బాధిత రైతులు కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

రైతు పొలంలో కందకాలు తీయొద్దు

● **కుతుంబాక శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ**

రోడ్డు నిర్మాణ పనుల కోసం మట్టిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి వినియోగించాల్సి ఉంటుంది. రైతుల పొలాల్లో ఎటువంటి కందకాలు తీయొద్దు. రైతు పొలంలో రోడ్డుకు సంబంధించి ఏదైనా పనులు చేపట్టాల్సి వస్తే సదరు రైతు అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి.

మాకు తెలియకుండా పొలంలో కందకాలు తీశారు

● **కళ్యాణం మాలతి, మహిళా రైతు, నాగులవంచ**



నాగులవంచ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 615లో 4 ఎకరాల మామిడి తోట ఉంది. పొలం పక్కనే కొత్తగా రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. మాకు సమాచారం ఇవ్వకుండా మా పొలంలో రాత్రి సమయంలో ఫెన్సింగ్ తీగకు అవతలి వైపు పొలం పొడవు న 4 అడుగుల లోతులో కందకం తీసి మట్టిని రోడ్డుకు వినియోగించుకుంటున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మా ఇష్టం అని సమాధానం చెబుతున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాము.

'వన్యప్రాణులను సంరక్షించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

పెనుబల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా సోమవారం వన్యప్రాణుల సంరక్షణ అవగాహన కార్యక్రమాన్ని ఉప్పలచలకలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో అటవీశాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ, వాటి ఆవాసాల గురించి విద్యార్థినులకు వివరించారు. వన్యప్రాణులను సంరక్షించుకునే బాధ్యత ప్రజలందరిపై ఉందని, సమాజంలో అందరికి తెలియపర్చాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వెంకటరమణ, అటవీశాఖ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏన్కూర్‌లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పర్యటన

ఏన్కూరు, మార్చి3(ఆంధ్రజ్యోతి): వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ సోమవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. రేపల్లెవాడ గ్రామంలో శుభకార్యానికి హాజరయ్యారు. నాచారం, ఏన్కూరు, నూకాలంపాడు, గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతులచిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు స్వర్ణనరేంద్రకుమార్, జూలూరుపాడు మాజీ సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, మండల నాయకులు మేడ ధర్మారావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, నల్లమల శివకుమార్, యండ్రాతి సాయి, , భూక్యా బాబులాల్, ఇంజం శేషగిరిరావు, రోశయ్య, నరసింహారావు తదితరులున్నారు.

షమీమ్ అక్తర్ నివేదికలోని లోపాలు సరిచేయాలి

▸▸ ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునిల్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మధిరటౌన్, మార్చి3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ కమిటీ ఇచ్చిన నివేదికలోని లోపాలను సరిచేయాలని ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునిల్ ప్రభుత్వాన్ని కోరా రు. ఎస్సీ వర్గీకరణను ఏ,బీ,సీలుగా కాకుండా ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించి మాదిగలలో ఉన్న అన్ని ఉప కులాలకు న్యాయం చేయాలని అన్నారు. ఈ నెల 4నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రంలో అనేక చోట్ల డప్పుల ప్రదర్శనను ఏర్పాటు చేయడం జరిగిందని, దానిలో భాగంగా ఈనెల 5 న ఖమ్మంలో జరిగే ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో మాదిగలు హాజరై ప్రదర్శన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనకపూడి శ్రీను, మేకల రాజ, పుల్లయ్య, దాసు, దేవ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి పంపిణీ తీరుపై పరిశీలన



కల్లూరులో పంటను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

కల్లూరు, మార్చి3 (ఆంధ్రజ్యోతి): కల్లూరు జలవనరులశాఖ డివిజ్ మధిర బ్రాంచ్ కాల్వ ద్వారా పంట పొలాలకు అందుతున్న సాగునీటి పంపిణీ తీరుపై సోమవారం క్షేత్ర స్థాయిలో ఆర్డీవో ఎల్. రాజేంద్రగౌడ్, వ్యవసాయ, జలవనరులశాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా అధికారులు సందర్శించి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు వారు మండల పరిధిలోని లింగాల, చెన్నూరు, పోచారం గ్రామాల్లో వరిపైరుకు సాగునీరు అందుతున్న తీరును పరిశీలించారు. మధిర బ్రాంచ్ కెనాల్ ద్వారా వారబందీ పద్ధతిపై సాగునీటి సరఫరా జరుగుతుంది. అయితే మధిర బ్రాంచ్ కెనాల్ పరిధిలో లింగాల, చెన్నూరు, పోచారం మేజర్ కాల్వల పరిధిలో చివర ఆయకట్టున గల వరి పైరుకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రైతుల ఫిర్యాదుపై ఆర్డీవో స్పందించారు. మధిర బ్రాంచ్ కెనాల్‌పై జరుగుతున్న నీటి సరఫరాను మరో రెండు రోజులు పాటుగా అదనంగా సాగునీరు అందించాలని జలవనరలశాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జలవనరులశాఖ డీఈ వెంకటేశ్వరరావు, సత్తుపల్లి డివిజన్ వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి, ఏవో రూపా, ఆర్ఐ సుజాత పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆళ్లపాడు మైనర్ పరిధిలో సాగు చేసిన మక్క పంటకు రెండు రోజుల్లో బీబీసీకి నీటిని విడుదల చేయని పక్షంలో పంటలు ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆళ్లపాడు రెవెన్యూ పరిధిలో రైతులు సాగు చేసిన మక్క పంటలను సోమవారం మధిర ఏడీఏ విజయచంద్ర, ఏవో వినయ్ కుమార్, ఇరిగేషన్‌శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పారా వెంకటమోహన్‌రావు, తోటకూర వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ గత వారబందీ నీటి విడుదల జరిగినపుడు చివర భూ ముల్లో 25 ఎకరాల వరకు తడవలేదని తెలిపారు. వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దింతో వ్యవసాయాధికారులు రైతుల అభిప్రాయాలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, రైతుల పంటలను కాపాడేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.



బోనకల్‌లో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

వంద శాతం పన్నుల వసూళ్లే లక్ష్యం

▸▸ మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహా



మాట్లాడుతున్న కమిషనర్ నర్సింహా

సత్తుపల్లిరూరల్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీలో ప్రధాన వనరైన ఆస్తిపన్ను వసూళ్లే లక్ష్యంగా ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు కమిషనర్ కొండ్రా నర్సింహ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.3,37,17,000వసూలు చేయగా రూ.1.53లక్షలను ఈనెలాఖరులోగా వసూలు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పా రు. పట్టణంలోని 23వార్డులకు చెందిన ప్రజలు మౌలిక సదుపాయాల కోసం, అభివృద్ధి కోసం సహకరించేందుకు పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు.

సీపీఎం నాయకుడు నాగయ్య మృతి



నాగయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కారేపల్లి, మార్చి3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీమలపాడు గ్రామానికి చెందిన సీనియర్ సీపీఎం నాయకుడు ఎరుపోతు నాగయ్య(78)అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. చీమలపాడు ప్రాంతంలో సీపీఎం పార్టీ ఎదుగుదలకు నాగయ్య ఎంతో కృషి చేశాడని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని వైరా డివిజన్ సీపీఎం పార్టీ కార్యదర్శి భూక్య వీరభద్రం అన్నారు. ఆయన ఆశయాలు సాధించాలని అన్నారు. పలువురు పార్టీ నాయకులు ఆయన భౌతికాయంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు.

ఉద్యాన అధికారి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తల్లాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఉద్యానవన శాఖ అధికారి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు తల్లాడ తహసీల్దార్ సురేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండలంలో ఆరువేల ఎకరాల్లో మిర్చి, రెండువేల ఎకరాల్లో మామిడితోటలు సాగుచేశారని వాటిని తెగుళ్లు ఆశించినప్పుడు నివారణ చర్యలు చేపట్టేందుకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఉద్యావన శాఖ అధికారి అందుబాటులో ఉండటం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆపతి వెంకటరామారావు, తేజావత్ బాలాజీనాయక్, గాదె కృష్ణారావు, వాడవల్లి నాగేశ్వరరావు, తమ్మిశెట్టి కృష్ణ, కిరణ్, నరేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుబల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగదేవిపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని పెనుబల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ సృజన ప్రారంభించారు. ఈ శిబిరంలో పశువులకు సూలు పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు కృత్రిమ గర్భధారణకు, దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెనుబల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, నాయకులు కాకా వెంకటేశ్వర్లు, మాలోతు రాధాకృష్ణ, తేజావత్ బాలాజీ, కుక్కా తిరుపతిరావు, పల్లెపు రాధాకృష్ణ, అజ్మీరా రాజా, లకావత్ వెంకన్న, కోమటి సోమేశ్వరరావు, బాణోతు శంకర్, గోపాలమిత్రలు, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

వైరా, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపూడి హైస్కూల్లో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులు చింతలపూడి వెంకటేశ్వరరావు, గుడిపూడి వెంకటేశ్వరరావు, మరికంటి రాంగోపాల్, వై.బుచ్చిరామారావు, చెరుకూరి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు కె.విజయబాబు, ఉపాధ్యాయులు శైలజ, కృష్ణారావు, శ్రీదేవి, సుశీల, పద్మావతి, గౌస్ పాల్గొన్నారు.



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

50పడకల ఆస్పత్రులుగా ముదిగొండ, ఎర్రుపాలెం పీహెచ్‌సీలు



ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ముదిగొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50పడకల ప్రభుత్వ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేశారు. గతంలో ఆరుపడకలుగా ఉన్న ఈ పీ హెచ్‌సీని 50పడకల ఆసుపత్రిగా అభివృద్ధికి ప్రభుత్వం జీవో జారీ చేసింది. మండల ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించేందుకు ఇప్పటివరకు ఆరుపడకల ఆసుపత్రిగా ఉన్న మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.22 కోట్లతో 50పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇకనుంచి 50పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చెందడంతోపాటు 24గంటల పాటు ప్రజలకు వైద్యసేవలు అందించనున్నారు.

ముదిగొండకు 50పడకల ఆసుపత్రిని మంజూరు చేయడం పట్ల రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు, మండల ప్రజలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రుపాలెం, మార్చి3(ఆంధ్రజ్యోతి): ఎర్రుపాలెం మడలానికి ఏళ్లనాటి కల ఫలించింది. 50పడకల ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు మండల కేద్రంలో ప్రభుత్వ దవాఖాన నిర్మాణానికి రూ.22కోట్లు మంజూరుచేస్తూ సోమవారం ఉత్తర్వులిచ్చింది. మెరుగైన వైద్యంకావాలంటే రాష్ట్రంసరిహద్దులో ఉన్న మండల ప్రజలు ఆంధ్రాకు పరుగెత్తాల్సిందే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తప్పా ప్రభుత్వ ఆసుపత్రిలేక మెరుగైన వైద్యంకోసం అల్లాడుతున్నారు. ఇంతకాలం ప్రాథమిక వైద్యానికే పరిమితమైన ఎర్రుపాలెం మండలంలో మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి ఇప్పటికే 3 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ శాఖ గుర్తించి వైద్యశాఖకు అప్పగించింది.

సుభాష్ వర్ధంతి సభను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కారేపల్లి, మార్చి3(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ఈనెల 9న జరగనున్న రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న)9వ వర్ధంతిని విజయవంతం చేయలని సీపీఐ (ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అవుల అశోక్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో టీ.ఝాన్సీగుమ్మడి సందీప్, గుగులోత్ తేజనాయక్, ఎన్వీ రాకేష్, ధారవత్ నక్రు, సత్తిరెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.

23న భగత్‌సింగ్ విగ్రహ ఆవిష్కరణ

సత్తుపల్లిరూరల్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23వ తేదీన భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సత్తుపల్లి మునిసిపాలిటీలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు నిర్మాణ కమిటీ కన్వీనర్ దండు ఆదినారాయణ సోమవారం తెలిపారు. స్థానిక మునిసిపల్ ఆఫీస్ ఎదురుగా జాతీయ జెండా సమీపంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండగా యువతీ, యువకులతో పాటు రాజకీయాలకతీతంగా పౌరులు సహకరించాలని కోరారు. కాగా నిర్మాణ స్థలంలో అనుమతులు, ఇతర పరిస్థితులను మునిసిపల్ అధికారులు పరిశీలించారు.



ఎనులను పరిశీలిస్తున్న మునిసిపల్ అధికారులు

మిర్చి రైతుల ఆందోళన

తల్లాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో సోమవారం సాయంత్రం ఆకాశం మేఘావృతం కావడంతో మిర్చి రైతులు ఆందోళనకు గురయ్యారు. కోసిన మిర్చి కల్లాల్లో ఆరబెట్టారు. ఆకాశం మే ఘావృతం కావడంతో వర్షం వస్తుందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి వర్షానికి తడిచి నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో రైతులు హడావుడిగా అందుబాటులో ఉన్న టార్పాలిన్లను తెచ్చి కప్పారు. జల్లులు పడకపోవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.



మిర్చిపై పట్టాలు కప్పుతున్న రైతులు

చింతకానిలో వందేమాతరం శ్రీనివాస్ సందడి



స్థానికులతో వందేమాతం శ్రీనివాస్

చింతకాని, మార్చి 3(ఆంధ్రజ్యోతి): చింతకాని తహసీల్దార్ కార్యాలయంలో సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ సోమవారం సందడి చేశాడు. రిజిస్ట్రేషన్ పని నిమిత్తం చింతకాని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అతనితో స్థానికులు ఫొటోలు దిగేందుకు పోటీలు పడ్డారు. సుమారు గంట సేపు కార్యాలయంలో గడిపారు.